
# మేఘర్నదుర మంటిరం

ఇచ్ఛాపురపు రామచంద్రం




ఇదిగో...యిలాటప్పుడే-జీవిత స్వరూపం - అందకుండా పొందకుండా...ఎదుట నిలిచి వెక్కిరించేది. వేనోళ్ళతో నవ్వేది. నీకేం "తెలుసోయ్ వెర్రిమొహమా అని ఎకసక్కెమాడేది.

కాకపోతే ఏమిటిది?

ఈ వోట మేమిటి?

*     *     *

భోజనంచేసి కూర్చున్నాను-ఇంగ్లీషు నవల పట్టుకొని కల్పనలో పతివ్రత నన్ను మిగిలిన వన్నిటినీ మరపించి—పుస్తకంలో లీనం చేసింది.

పది ఔతుందేమో...వొచ్చాడు విశ్వం.

ఎలాగ?

చిన్న తూలుడు ... మందహాసం...మసాలావాసన ... మల్లెపూలదో మరలాటి సెంటుదో మరో వాసన. రాత్రి పది గంటలకి అతను రావడమే ఒక ఆశ్చర్యమయితే-అతని మాటలు మరీ ఆశ్చర్యం గొలిపాయి.

"నేను-చావడానికి వెళ్తున్నాను. చివరిసారిగా నిన్ను చూసి-చెప్పి పోదామని వొచ్చాను. గుడ్ బై ఫరెవర్"

వొళ్లు మండింది నాకు...నవలా భంగం కలిగించినందుకుకాదు. అతని మాటలకి. అతనికి ఐశ్వర్యముంది. అందమయిన భార్య ఉంది. అనుభవించే వయసుంది. మరేమిటి పిచ్చి మాటలు?

"మందెక్కువయిందా?" మందలిస్తున్నట్లడిగాను.

"నిజంగా మందెక్కువయింది. విందెక్కువయింది. పొందూ

ఎక్కువే అయింది. ఎక్కువ మాటలెందుకూ?...జీవితమే ఎక్కువయింది."

"అంటే?" తెల్లమొహంవేసి చూశాను.

"అందేనా? అర్థంకాలేదూ? నువ్వేం రచయితవి? ఇంక నా జీవితంలో అనుభవించడానికేమీ కనిపించక ఆత్మహత్యచేసుకోబుద్ధేస్తూందని. అన్ని రుచులూ చూసేశాను. ఇంక బతికినా మానినా ఒకటే. విసుగేస్తూంది. నేనుండి లాభమూ లేదు. లేక నష్టమూ లేదు ప్రపంచానికి. ఎందుకీ వ్యర్థ జీవితం జీవించాలి?

గుడ్ బై...ఫరెవర్..."

నామాట వినిపించుకోకుండా...నన్నసలు పట్టించుకోకుండా...అలాగ మొండిగా...గుడ్‌బై చెప్పేసి అతనయితే వెళ్ళిపోయాడు కానీ—నేను ఆలోచనలో పడ్డాను పుస్తకం వొదిలి.

అన్నీ అంది అతనికి వైరాగ్యం వొస్తే—
ఏదీ అందక నాకు వైరాగ్యం రావాలి. కాని—రావడంలేదు!

భార్య ఉంది–సుఖపెట్టకుండా ... సుఖపడనివ్వకుండా. డబ్బులేదు. వయసూ లేదు. నేనుండి ప్రయోజనమూలేదు, లేక నష్టమూ లేదెవరికీ. ప్రపంచం నాకు కాని నేను ప్రపంచానికి కానీ యివ్వవలసిందీ యివ్వగలిగిందీ ఏమీ కనిపించదు. మరి—నేనెందుకు బతుకుతున్నాను?

ఎలా బతుకుతున్నాను?

ఏం చూసుకుని?

ఈ ప్రపంచానికి నా వల్ల చిన్నమెత్తు ఉపయోగంలేదు. నిజంగా నాది వ్యర్థ జీవితమే. మూసినా తెరచినా ఒకటే అయిన గుడ్డి కంటి తీరు.

న్యాయంతామాఅన్నీ ఉన్న అతను లేక—

ఏమీలేని నేనే యీ ప్రపంచంనుంచి...పెరవారికి చోటొసంగుచూ... తొందరగా నిష్క్రమించాలేమో.

రాత్రి గడుస్తూంది.

ఆలోచనలు తెగడం లేదు.

నీటికి నాచు తెగులు...మాటికి మాట తెగులు లాగా ఆలోచనకి ఆలోచన తెగులేమో.

నవల వొదిలి—ఆలోచనల అంతం చూస్తున్నాను.

అర్ధరాత్రి గడిచిందనే గమనించలేదు.

అలాగే..వరండాలో... విద్యుద్దీపంకింద...వాలు కుర్చీలో...ఆంగ్ల నవలని గుండెలమీద పెట్టుకొని ఆలోచనల ఆకాశంలో...

త్రుళ్ళి పడ్డాను.

నిశ్శబ్దం–చిన్న శబ్దాన్ని పెద్దది చేస్తుంది.

ఆలోచనలు—భంగపడితే—మనిషికి త్రుళ్ళిపాటు కలిగిస్తాయి.

కళ్ళు విప్పి చూశాను.

గోడకు కొట్టిన బంతిలా వొచ్చేసిన విశ్వాన్ని చూసి—నవ్వాను.

"భయమేసిందా తీరా ఆ క్షణం వొచ్చేసరికి?"

"భయమా! నాకా! హుఁ. చావబోయేవాడికి సముద్రం మోకాలి లోతు."

మరెందుకు చచ్చిపోలేదు నువ్వు?"

"జీవితాని కర్థం తెలిసింది."

ఆత్రంగా అడిగాను. "ఏమిటి? జీవితమంటే ఏమిటి?"

"అర్థం చేసుకో..." అని ఉపక్రమించాడు.

"అందంగా...హాయిగా చచ్చిపోదామని...వెన్నెలలో...ఊరి చివరకు...ఏటి అవతలకు బయలు దేరాను. (ప్రకృతి...వెన్నెలా...పరిసరాలూ మహా బాగున్నయ్. ఆ యిళ్ళ వరుస దాటానో ఊరు దాటినట్లే. వంతెన దాటే సరికి...

"మాష్టారూ?"

"ఊఁ"

"చిన్న సహాయం చేసి పెట్టరూ?"

"ఏమిటి?" పోన్లే మానవుడనుకుని అనుగ్రహించాను.

"మా పాపకి సీరియస్‌గా ఉంది. ఇంట్లో ఎవరూ లేరు. నేను ఊళ్ళోకి వెళ్ళి డాక్టర్ని తీసుకు వొచ్చే వరకూ...ఓ అరగంట...పాపకి సాయంగా ఉండరూ కనిపెట్టుకొని? ప్లీజ్—"

"దానికేముంది? అలాగే పదండి"

బ్రిడ్జి పక్కన—డొనులో—ఆ యింట్లోకి నడిచానతనితో.

"ఆ గదిలో ఉంది పాప—వేగంగా డాక్టర్ని తీసుకు వొచ్చేస్తాను పాపకసలే భయం. నేను వొచ్చేలోగా వెళ్ళిపోకండేం పాపని వొంటరిగా వొదిలి? థాంక్యూ—" అతను హడావిడిగా వెళ్ళిపోయాడు.

నేనా గదిలోకి నడిచాను.

దీపం వెలుగులో–మంచంమీద—

కెవ్వుమని కేకవేయకుండా ఎలా ఉండగలిగానో ఆ దృశ్యం చూసీ.

నైతికంగా—అతని కిచ్చిన వాక్కుకి కట్టుబడబట్టి అక్కడ అతను డాక్టర్ని వెంటబెట్టుకు వొచ్చేవరకూ ఉన్నాను కానీ–లేకపోతే ఆ పాపని చూసిన క్షణం అక్కడనుంచి పరుగెత్తి పారిపోయేవాడినే.

డాక్టరు–ఆ పాపకి యింజక్షనిచ్చి వెళ్ళిపోయాడు.

నాకు–జాలేస్తుందా మానవుడిమీద.

ఎందుకా పాపమీద అతని కా మమకారం?

ఆ పాపలో–ఏముందని? పదిహేనేళ్ళ వయసట కానీ–పదినెలల పాపాయి సైజులోకూడా లేదు శరీరం. కాళ్ళూ చేతులూ అవి చీపురు పుల్లలన వొచ్చయితేవాటినీ అనవొచ్చు. కేక తప్ప మాట రాజాలదానోట. కదలలేని—మెదలలేని—మాంసపు ముద్ద. అదీ ఆ పాప. దిష్టిబొమ్మకంటె వికృతంగా—పిశాచపు పిల్లలా భయంకరంగా—

ఉండబట్టలేక అడిగేశాను. "ఎందుకింకా ఆమెకోసం మీరు తాపత్రయ పడతారు? జీవించి లాభమేమిటి? మీరు డాక్టర్ని తీసుకురాకపోతే–పాప కచ్చితంగా చచ్చిపోయేదికదా. బతికి బావుకునేదేమీలేదు. చచ్చి పోవడమే మేలూ సుఖమూ కదా అటువంటి జీవులకి—"

లోపలనుంచి–కెవ్వున–యిల్లెగిరి పోయేలా కేక. ఆ పోలియో పాప కింత కంఠముందా? ఆశ్చర్యపోయాను.

"ప్లీజ్–దయచేసి–చావు–మృత్యువు–మరణం–అనే మాటలు అనకండి. పాప చాలా భయపడి–గోల చేస్తుంది. ఊఁ–లేదమ్మా–లేదు–నీ గురించి కాదు–నువ్వు చిరంజీవివి. నీకేమమ్మా–హాయిగా కలకాలం బతుకుతావు." అంటూ పాప దగ్గరికి పరిగెత్తాడా మానవుడు.

నా ఆశ్చర్యానికి అవధి లేక పోయింది.

కన్నతల్లే వదిలేసిపోయినా–ఆ పాపని సాకుతున్న యీ మానవుడే విచిత్రమనుకుంటే– కదలలేక–మంచంలో పడుంటూ–ప్రతిపనికీ అతనిమీద ఆధార పడుతూ–పరాధీనంగా– శాపగ్రస్తలా–బతుకుతున్న ఆ పాప–చావుకి భయపడడం

# జీవితం

## శ్రీ సడ్లపల్లె చిదంబరరెడ్డి

పాఠాలకు
అధ్యాయాలకు
చిత్రాలకు
విచిత్రాలకు
పుటలకు
రసాలకు
పొందు లేని పుస్తకం !
ప్రతి మనిషికీ ఒక భూషణం !!
చదువు దామంటే
కనిపించని అక్షరాలు
కనిపించినా —
కొరుకుడు పడని పదాలు
నానార్థాలు
అనర్థాలు
ప్రశ్నార్థకాలు
సంశయ పరంపరలు !!
మూసేద్దామంటే
మూలతో సేద్దామంటే
చుట్టూరా వెక్కిరింతలు
అవహేళలను
పదం పదంలో సమస్యలు
నోరు పెకలని పరిస్థితులు !!
రాత్రీ పగలు తిరగేసినా
ముగిసివచ్చే కనిపిస్తూ
దానుగెద్దు బాటలాగ
భూగోళం కక్షలాగ
చుక్కల లెక్కింపు లాగ
ఎడారి దారి లాగ
అక్షయమైన పేజీలు
అవతరిస్తూనే ఉంటాయి
అందరి చేతుల్లోనూ
విశేషం గానే
తొంగిచూస్తుంటాయి
తమ పుస్తకం వరకూ
అందరూ విద్యార్థులే !
ఎదుటివారి కెరిగించడంలో
అందరూ ఉపాధ్యాయులే !
ప్రతి వాడూ కాపీ మాష్టారు
ప్రతి లైనులో కొట్టి వేతలు
సవరణలు
ఉదాహరణలు
వాఖ్యానాలు
తన దానికి దీటు మరొటి లేదు
అన్నింటికీ తనదే ఆదర్శం
అన్నదే అందరి భావం !!
ఎన్నో జవాబులు
ఒకే సమస్యకు
ఒక్క సమస్యకూ
దొరకని సమాధానాలు - అసంపూర్ణాలు
ఆ పుస్తకం నిండా !!
అందుకే ఆ పుస్తకాన్ని "జీవితం" అన్నారు

మరో మహా విచిత్రం.

ఈ జీవితంలో-ఏం కనపడుతుందామెకు?

ఆ పోలియో పాప-మంచానికంటిపెట్టుకున్న మాంసపు ముద్దకి-జీవితంలో-భవిష్యత్తులో ఏం కనిపిస్తూంది? ఇవాల్టినుంచి- రేపటివేపుకి-ఏది ఆకర్షిస్తూంది.

ఆ రోగిష్టి పాపే చూడగలుగుతున్న జీవితాన్ని - జీవితంలోని ఆకర్షణని-అన్నివిధాలా సమర్థుడి నయిన నేనెందుకు చూడలేక పోతున్నాను?

ఆమె-జీవించాలని అంత తీవ్రంగా ఆరాటపడుతుంటే నేనెందుకు జీవితాన్ని చాలించాలనే విసుగుకి లోనయ్యాను?

గుడ్డివాడు చూడగలుగుతూ - కళ్లున్నవాడు చూడలేకపోతున్నట్లు-విచిత్రంగా లేదూ?

నాకు పౌరుషం వొచ్చింది.

ఈ జీవితంలోని ఆకర్షణ ఏమిటో తేల్చుకోవాలనిపించింది

తేల్చుకుందామన్న పట్టుదలతో-"

తిరిగి వొచ్చేశాడు-చచ్చిపోకుండా

అదీ సంగతి

నాక్కు పట్టరాని ఆనందం కలిగింది

విశ్వాన్ని కౌగలించుకున్నాను ఆప్యాయంగా.

సంతోషం ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే- "నీకు చాలా కృతజ్ఞతలోయ్" అన్నానతని చేతులు పట్టుకుని

ఈసారి తెల్లబోవడం అతనివంతయింది

"దేనికి?"

నవ్వాను. నువ్వు బ్రతికి-నన్ను బ్రతికించావు"

ఇంకా వెర్రి మొహం వేసుకునే ఉన్నాడతను.

అతనికి నేనింక ఏమీ చెప్పదలచుకోలేదు. నా ఆలోచనయీ అవి నన్ను తీసుకువెళ్ళిన దూరమూ - విశ్వంలాంటివాడే జీవితంమీద విసుగుపుట్టి చనిపోతే నేనెందుకు చెప్పడం?

అతనే అర్థం చేసుకుంటాడు చేసుకోగలిగితే